
నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

తాండూరులో 5 నామినేషన్లు

తిరస్కరణ

తాండూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధిలోని చెంగేష్‌పూర్, నారాయణపూర్, అల్లాపూర్, కరన్‌కోట్ గ్రామ పంచాయతీలకు చెందిన ఐదు వార్డు సభ్యుల అభ్యర్థులకు సంబంధించి నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఆయా క్లస్టర్ల అధికారులు తెలిపారు. చెంగేష్‌పూర్ గ్రామ పంచాయతీలో 5వ వార్డుకు కలాల్ మంజునాథ్ గౌడ్ వయస్సు 21 సంవత్సరాలకు 20 సంవత్సరాలు ఉండటంతో నామినేషన్ తిరస్కరించినట్లు క్లస్టర్ అధికారి సాయి బన్న తెలిపారు. నారాయణపూర్ పంచాయతీలో 4వ వార్డు ఎస్సీ మహిళలకు కేటాయించగా పురుషుడు రమేశ్ నామినేషన్ వేయడంతో తిరస్కరించినట్లు క్లస్టర్ అధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. అల్లాపూర్ పంచాయతీలో 4వ వార్డుకు మడపతి నాగేంద్రయ్య స్వామి నామినేషన్ వేయగా ఆయన ప్రతిపాదించిన 5వ వార్డు వ్యక్తి ప్రపోజల్ లేకపోవడంతో తిరస్కరణకు గురైంది. అదే గ్రామ పంచాయతీలో 6వ వార్డు జిన్‌గుర్తి అక్షిత గౌడ్ నామినేషన్ వేయగా వయస్సు 21 సంవత్సరాలకు 20 సంవత్సరాలుగా ఓటర్ జాబితాలో ఉండటంతో నామినేషన్‌ను తిరస్కరించినట్లు క్లస్టర్ అధికారి సాయి ప్రణీత్ వెల్లడించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. జిల్లాలో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగియగా రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కోట్‌పల్లి మండలం కరీంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి హమీదుద్దీన్‌ను ఆదివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు ఎలక్షన్ విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు.


నామినేషన్ రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

ప్రతి విషయం వివరించాలి

» వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి విషయం క్షుప్తంగా వివరించాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. రెండో విడత నామినేషన్ ప్రక్రియ ఆదివారం ప్రారంభం కాగా మండలంలో ఏడు క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మద్దతుదారులతో వచ్చి కొందరు నామినేషన్లు వేశారు. సిద్దులూరు క్లస్టర్ పరిధిలో నామినేషన్ కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌ఓ, ఏఆర్‌వోలతో మాట్లాడారు. నామినేషన్లు తిరస్కరణకు గురికాకుండా అభ్యర్థులకు ముందుగానే అన్ని విషయాలను క్షుప్తంగా వివరించాలన్నారు. అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలు, ఖర్చుల వివరాలు అన్నింటి గురించి చెప్పాలన్నారు. సాయంత్రం వరకు నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. నామినేషన్ వేసే అభ్యర్థుల వెంట ఇద్దరికి మాత్రమే లోపలికి అనుమతి ఇవ్వాలని పోలీస్ సిబ్బందికి సూచించారు.


షీల్డ్, ప్రశంసాపత్రం అందుకుంటున్న కార్తికేయ

భగవద్గీత శ్లోక పోటీల్లో కార్తికేయ ప్రతిభ

తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఈ నెల 30న గుజరాతి మహా విద్యాలయ హైస్కూల్ హైదరాబాద్‌లో నిర్వహించిన భగవద్గీత శ్లోక పోటీల్లో కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి కార్తికేయ ప్రతిభ చాటి రెండో స్థానం సాధించాడు. విద్యారికి నిర్వాహకులు ప్రశంసపత్రం, షిల్డ్‌ను అందజేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ హెచ్‌ఎం, మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్, డైరెక్టర్ సతీష్, పాఠశాల సిబ్బంది కార్తికేయను అభినందించారు.

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మూడు రోజులుగా జరిగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శనివారంతో ముగిసింది. మొదటి రెండు రోజులు మందకొడిగా నామినేషన్లు వస్తే, ఆఖరి రోజు మూడింతలకు పైగా దాఖలు కావడం విశేషం. పెద్దేముల్ మండలంలో అత్యధికంగా, దుద్యాల్ మండలంలో అత్యల్పంగా నామినేషన్లు వచ్చాయి. తొలి విడత ఎన్నికలు ఈనెల 11వ తేదీన జరగనున్నాయి. అయితే గత పంచాయతీ ఎన్నికల కంటే అధిక సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ముందుకు వచ్చారు.




సిద్దులూరులో నామినేషన్ వేస్తున్న అభ్యర్థి

5,763

తొలి విడత నామినేషన్లు



సర్పంచ్‌లకు 1,384.. వార్డు పదవులకు 4,379

ఆఖరి రోజు మూడింతలు దాఖలు.. పెద్దేముల్‌లో అత్యధికం

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో తొలి విడతలో తాండూరు, బషీరాబాద్, యాలాల్, పెద్దేముల్, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల పరిధిలోని 262 పంచాయతీలు, 2,198 వార్డులకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా, సర్పంచ్ పదవులకు మొదటి, రెండు రోజులు కలిపి 341 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు పదవులకు 438 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల చివరి రోజు నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు పోటీ పడ్డారు. శనివారం ఒక్క రోజే సర్పంచ్ పదవులకు 1,043 నామినేషన్లు, వార్డు పదవులకు 3,943 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 262 సర్పంచ్

మిగతా 8వ పేజీలో...

ఆఖరి రోజు వచ్చిన నామినేషన్లు	పంచాయతీలకు	వార్డులకు
	1,043	3,943

మొదటి విడతలో వచ్చిన నామినేషన్లు

మండలం	పంచాయతీలు	నామినేషన్లు	వార్డులు	నామినేషన్లు
తాండూరు	33	166	290	557
బషీరాబాద్	39	208	312	616
యాలాల	39	195	318	584
పెద్దేముల్	38	221	308	670
కొడంగల్	25	152	222	465
దౌల్తాబాద్	33	173	290	593
బొంరాస్‌పేట్	35	152	292	526
దుద్యాల్	20	117	166	348
మొత్తం	262	1,384	2,198	4,379

రెండో విడత తొలిరోజు

» 175 పంచాయతీలకు 366 నామినేషన్లు

» సర్పంచ్‌కు 184.. వార్డు సభ్యుడి పదవులకు 182


మోమిన్‌పేట్ మండలం టేకులపల్లిలో నామినేషన్ వేస్తున్న బండ విష్ణువర్ధన్‌రెడ్డి

రెండో విడత పంచాయతీ సంగ్రామం ప్రారంభమైంది. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు రిటర్నింగ్ అధికారులు ఆదివారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. క్లస్టర్ కేంద్రాల పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్, వార్డు పదవులకు వారు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరగనున్న వికారాబాద్, చేవెళ్ల నియోజక వర్గాల పరిధిలో ఏడు మండలాల్లోని పంచాయతీల్లో

మిగతా 8వ పేజీలో...


నేడు వరల్డ్ ఎయిడ్స్ డే

చాపకింద నీరులా హెచ్ఐవీ

జిల్లాలో ఈ ఏడాది 62 మందికి పాజిటివ్


నిర్లక్ష్యం వహిస్తే తప్పదు మూల్యం.. ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పులి రాజాకు ఎయిడ్స్ వస్తుందా.. అంటే జాగ్రత్తలు పాటించక పోతే వస్తుందనే చెప్పవచ్చు. అందరి దృష్టిని కేంద్రీకరించేలా ఆనాడు వీధుల్లో పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా అంటూ ఏర్పాటు చేసిన పెదపెద్ద ప్రచార హోర్డింగ్‌లు నేడు కనిపించడం లేదు. ఎయిడ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వాలు చేపట్టిన ప్రచార కార్యక్రమాలతో విద్యావంతులు కాస్త అప్రమత్తమైనప్పటికీ నిరక్షరాస్యులు మాత్రం హెచ్ఐవీ భారిన పడుతున్నారు. నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం హెచ్ఐవీ సంక్రమణ చాపకింద నీరులా మారింది. ఏటేటా మేడ్చల్ జిల్లాలో హెచ్ఐవీ బారిన పడ్డ వారి సంఖ్య పెరగడం ఆందోళనకు గురి చేస్తున్నది.

18 నుంచి 35 ఏళ్ల మధ్య వారే ఎక్కువ

జిల్లాలో ఎయిడ్స్ బారిన పడిన వారిలో 18 నుంచి 35 ఏళ్ల లోపు వారే అధికంగా ఉన్నారు. వీరిలో మహిళల కంటే పురుషుల సంఖ్య ఎక్కువగా

మిగతా 8వ పేజీలో...



రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతున్నాం

హెచ్ఐవీ సంక్రమించిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని పెంచుతున్నాం. హెచ్ఐవీ బారిన పడ్డ వారు సక్రమంగా మందులు వాడితే 30 నుంచి 40 సంవత్సరాల వరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా జీవించవచ్చు. శారీరక సంబంధాలతో హెచ్ఐవీ అధికంగా సంక్రమిస్తున్నట్లు కౌన్సెలింగ్‌లో బాధితులు చెబుతున్నారు. నియంత్రణ కోసం ప్రజలను చైతన్య పరచటానికి గ్రామాల్లో కళాజాత, కళాకారులతో ప్రచారం చేయించటంతో పాటు లారీలు, లేబర్ అడ్డాల వద్ద కండోమ్‌లను అందుబాటులో ఉంచుతున్నాం. ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

- ఉమాగౌరి, డీఎంహెచ్‌వో, మేడ్చల్

ప్రచారానికి వారమే గడువు
తాండూరు సెగ్మెంట్‌లో లక్షా 67వేల 171 మంది ఓటర్లు
3న గుర్తుల కేటాయింపు
మూడు రకాల బ్యాలెట్‌లు సిద్ధం
6

అర్ధ శతాబ్దం ఒకే కుటుంబం
కరన్‌కోట్‌లో సర్పంచ్‌గా రికార్డ్
7

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి
మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి
8

మైసమ్మగుట్ట వద్దే అండర్ పాస్

» ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట కాలనీ చౌరస్తా వద్దే అండర్ పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. అండర్ పాస్ నిర్మాణ స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. అయితే అండర్ పాస్‌ను మరోచోటికి మారుస్తున్నారనే ప్రచారంతో కాలనీవాసులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇక్కడ హైవే దాటే క్రమంలో పదుల సంఖ్యలో కాలనీవాసులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీ ఈటల మాట్లాడుతూ.. గతంలో రూపొందించిన ప్లాన్ ప్రకారమే అండర్ పాస్ నిర్మాణం చేపడతామన్నారు. ఈమేరకు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం శివారెడ్డిగూడలోని దండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజలో, బాలాజీనగర్‌లోని గీతామందిర్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సహకార సంఘం ఛైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపీ

ఆరని మంటలు

రావణకాష్టంలా కాలుతున్న చెత్త.. ఫైరింజన్ వచ్చినా ఆరని నిప్పు
దుర్వాసనతో సతమతమవుతున్న ప్రజలు.. చెత్తను తరలించాలని డిమాండ్

ఘట్‌కేసర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఘట్‌కేసర్ ఔటర్ టోల్‌ప్లాజా వద్ద రావణకాష్టంలా చెత్త నిరంతరం కాలుతూనే ఉంది. కొన్ని నెలలుగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో వెలువడుతున్న చెత్తను ఘట్‌కేసర్ ఔటర్ టోల్‌ప్లాజా వద్ద సర్వీసు రోడ్డ పక్కన పడేస్తున్నారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలో వెలువడే చెత్తను జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించేవారు. ఇప్పుడు దాదాపు సంవత్సర కాలంగా చెత్తను బయటకు తరలించడం లేదు. దీనికి అధికారులు చెబుతున్నదేమంటే చెత్తకు మంటలు ఆరడం లేదని, దీంతో చెత్తను తరలించడం సాధ్యం కావడం లేదంటూ వంతగా సమాధానం చెబుతున్నారు.

అదుపులోకి రాని మంటలు

కాలుతున్న చెత్తతో పొగ తీవ్రత వస్తుందని ఇటీవల అధికారులు ఫైరింజన్‌ను తెప్పించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైరింజన్‌లో నీళ్ల అయిపోతున్నాయి తప్ప

మిగతా 8వ పేజీలో...


ఔటర్ టోల్‌ప్లాజా వద్ద కాలుతున్న చెత్తతో వ్యాపిస్తున్న పొగ



చెత్త తరలింపునకు చర్యలు చేపడుతున్నాం

అన్నోజిగూడ సమీపంలో చెత్త సమస్యను శ్వాశతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పంటిస్తుడటంతో చెత్త తరలింపు ఇబ్బందిగా మారింది. మంటలను పూర్తిగా ఆర్పివేసేందుకు ఫైరింజన్‌ను ఏర్పాటు చేశాం. మంటలు పూర్తిగా తగ్గిన తర్వాత చెత్తను తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

- నిత్యానంద్, మున్సిపల్ కమిషనర్, పోచారం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

» ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ ఉత్సవాల్లో పురోహితులు వెంకటచారి శుక్రవార్ ఆధ్వర్యంలో గ్రామ దేవత బొడ్రాయి, శ్రీవిజయగణపతి, శ్రీసంతాన నాగదేవత, ధ్వజస్తంభం, ఆంజనేయస్వామి నూతన ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగిన ఉత్సవాల్లో విగ్రహాలకు జలాభిషేకం, దంపతులతో గణపతి హోమం, జలాధివాసం, గోపూజ, ధ్వజారోహణం, విగ్రహాల ఊరేగింపు, అఖండ దీపారాధన, నవగ్రహ హోమం, దేవతామూర్తుల ప్రతిష్ఠాపన, అభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఎస్. రవీందర్‌గౌడ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గౌడి మంజుల, భక్తులు ఎల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శాంత్‌కుమార్, రాములు, సుబ్బారెడ్డి, మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం


తాండూరు: ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

భార్యను హతమార్చిన భర్త

పెద్దేముల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. ఈ సంఘటన పెద్దేముల్ తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్‌కు అనుబంధంగా ఉన్న పెద్దేముల్ తండాకు చెందిన ముడావత్ రవినాయక్, అనిత భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. ఇటీవల రవినాయక్‌కు భూమి విషయంలో అదేతండాకు చెందిన బంధువులతో గొడవ జరిగింది. దీంతో అతడు మానసికంగా కుంగిపోయి మతిస్థిమితం లేనట్లుగా ప్రవర్తిస్తున్నాడు. ఆదివారం భార్యభర్తల మధ్య జరిగిన గొడవలో రవి ఇంట్లో ఉన్న సలికపార తీసుకుని భార్య అనిత(35) తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శంకర్ తెలిపారు.





రాంపూర్‌లో కాంగ్రెస్ ర్యాలీలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

పంచాయతీ ఎన్నికల్లో విపక్షాలకు పరాభవం తప్పదు

తలకొండపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో విపక్షాలకు పరాభవం తప్పదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం రాంపూర్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి మొక్తాల అనంతనర్సింహులుగౌడ్‌కు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల విజయం తథ్యం అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరిగిందని నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపర్చిన వారు 90శాతం సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డి.ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాసాచారి, కృష్ణారెడ్డి, వెంకటయ్య, నయీమొద్దీన్, సాబెర్, పెంటయ్య పాల్గొన్నారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఖానాపూర్‌లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి వారికి కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటన ర్సింహ, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు మిట్టపల్లి అంజయ్య, మోహన్‌రెడ్డి, అజీజ్, చంద్రకుమార్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

కడ్తాల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. కడ్తాల మండలం గోర్లకుంట తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం జైపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జైపాల్ మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను 420 హామీలు, ఆరు గ్యారంటీలపై నిలదీయాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం తప్పదన్నారు. పార్టీలో చేరిన వారిలో రవి, మోహన్, శ్రీను, మున్న్య, శ్రీను, లక్ష్మణ్, వెంకట్రాములు, శంకర్, లక్ష్మణ్, శివ, అనిల్, వెంకటేశ్ ఉన్నారు. మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, నాయకులు రామకృష్ణ, లక్ష్మీనర్సింహారెడ్డి, బావండ్లపల్లి ఆనంద్, పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జైపాల్‌యాదవ్







ప్రచారానికి గడువు వారమే

- తాండూరు సెగ్మెంట్‌లో లక్షా 67వేల 171 మంది ఓటర్లు
- 3న గుర్తుల కేటాయింపు
- మూడు రకాల బ్యాలెట్‌లు సిద్ధం

తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మొదటి విడత నామినేషన్ల పర్వ ముగిసింది. అభ్యర్థుల విత్‌డ్రా 3వ తేదీతో ముగియనుంది. ఇంకా ఎన్నికల గుర్తులు కేటాయింపుతో పల్లె రాజకీయం వేడెక్కనుంది. సర్పంచ్‌కు పింక్ రంగు బ్యాలెట్ పేపరు, వార్డు సభ్యుడికి తెలుపు రంగు బ్యాలెట్ పేపరును ఎన్నికల సంఘం కేటాయించింది. సర్పంచ్‌కు 30రకాలు, వార్డు సభ్యుడికి 30రకాల గుర్తులు కేటాయించారు. ఈనెల 3వ తేదీన విత్‌డ్రా తర్వాత సాయంత్రం 3గంటలకు ఫైనల్ లిస్టును ఆర్‌వోలు ప్రకటించిన తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. తెలుగు అక్షర క్రమంలో గుర్తులను అభ్యర్థులకు కేటాయిస్తారు. తాండూరు నియోజకవర్గంలో 149 గ్రామపంచాయతీలు ఉండగా 10గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

బ్యాలెట్ బాక్సులు మూడు రకాలు

గ్రామపంచాయతీ ఎన్నికల్లో 300 నుంచి మొదలుకుని 8వేల వరకు ఓట్లు ఉన్నాయి. ప్రతీ గ్రామంలో 6 నుంచి 14 వార్డులున్నాయి. ఒక్కో వార్డుకు ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తారు. వార్డు ఓటర్ల ఆధారంగా మూడురకాల బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. అందులో స్మాల్, మీడియం, లార్జ్, జంబో బాక్సులను ఏర్పాటు చేస్తున్నారు. అందులో 100 ఓట్లు పట్టే బాక్సు, 200 ఓటర్లు పట్టే బాక్సు, 1000 ఓట్లకు పైగా పట్టే బాక్సులను జంబో బాక్సులుగా ఏర్పాటు చేయనున్నారు. చిన్న రకాల బ్యాలెట్ బాక్సుల్లో వందఓట్ల వరకు పడతాయి. ఒకే బ్యాలెట్ బాక్స్‌లో సర్పంచ్, వార్డు సభ్యుడిని ఎన్నుకోవడానికి రెండు ఓట్లు ఉంటాయి. 50మంది కంటే తక్కువ ఓటర్లు ఉన్న వార్డుల్లో ఈ చిన్న రకాల బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తారు. 50మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న వార్డులకు ఈ మధ్య రకం బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తారు. 200వరకు ఓట్లు వేయవచ్చు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న వార్డుల్లో పెద్ద బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేస్తారు. 3వేల మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గ్రామపంచాయతీల్లో పెద్ద బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచుతారు.



ఓటర్ల వివరాలు

మండలం	పంచాయతీలు	ఓటర్లు
తాండూరు	33	46,646
పెద్దేముల్	38	40,828
బషీరాబాద్	39	40,987
యాలాల	39	38,710

ఓట్ల కోసమొచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

కడ్తాల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీల అమలుపై ప్రజలు నిలదీయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ముద్విన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హరీశ్‌రావు పార్టీ కండువాలు కప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందన్నారు. ఎన్నికల హామీల అమలో చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించడంలో, రాష్ట్ర హక్కులను కాపాడడంలో రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. రాష్ట్రంలో 8మంది బీజేపీ ఎంపీలున్నా రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీనీ తీసుకురాలేదన్నారు. రాష్ట్రంలో అబివృద్ధి పరుగులు పెట్టాలంటే కేసీఆర్‌తోనే సాధ్యం అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం తథ్యం అని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, జి.వెంకటేశ్, వినోద్, గోపాల్, పంతూనాయక్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సామాజిక సేవలతోనే కీర్తి

కడ్తాల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సేవలను బట్టే ఒక మనిషికి కీర్తి లభిస్తుందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి, ఉమ్మడి ఆమనగల్లు మండలానికి పంతూనాయక్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మైసిగండిలో ఆదివారం డీసీసీబీ చైర్మన్ మామిండ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి రవి పర్యటించారు. సోమవారం పంతూనాయక్ వర్ధంతి నేపథ్యంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. పేదల, గిరిజనుల శ్రేయస్సుకు పాటుపడిన మహోన్నత వ్యక్తి పంతూనాయక్ అన్నారు. మైసిగండి మైసమ్మ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు నందిస్తానని ఎంపీ చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ బలపర్చిన వారిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలి, తహసీల్దార్ ఆర్పీ జ్యోతి, నాయకులు అరుణ్, భాస్కర్, సీత, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, జవహర్‌లాల్, హీరాసింగ్, తులసీరామ్, శేఖర్‌గౌడ్ ఉన్నారు.



పంతూనాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మల్లు రవి



రేగడిదోస్వాడలో రైతులతో మాట్లాడుతున్న భాస్కర్

అసైన్డ్ రైతులకు పట్టాలివ్వాలి

షాబాద్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని రేగడిదస్వాడ, మక్తగూడ గ్రామాల్లోని అసైన్డ్ రైతులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల భూములు లాక్కొని పెట్టుబడిదారులకు కట్టిపెడుతోందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని హామీ ఇచ్చారని, ప్రభుత్వం వారిదే కాబట్టి వెంటనే రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములను లాక్కోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, లేని పక్షంలో ఆందోళనలు, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవేందర్, రాములు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

టెట్ నుంచి భాషా పండితులకు మినహాయింపునివ్వాలి


పెద్దేముల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్ష నుంచి భాషాపండితులకు మినహాయింపునివ్వాలని పండిత పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మానుపురి వెంకటేశ్వర్లు, ఎజాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని నేతాజి గురుకుల పాఠశాలలో ఆదివారం రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ పెద్దేముల్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ.. టెట్‌పరీక్ష నుంచి భాషా పండితులకు మినహాయింపు కోసం రాష్ట్రశాఖ కృషిచేస్తోందన్నారు. ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైనదని పిలుపునిచ్చారు. 1/2005 యాక్ట్ రద్దు కోసం న్యాయపోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. ఇతర సబ్జెక్టులతో సమానంగా ఉన్నత పాఠశాలలో భాషా ఉపాధ్యాయులను నియమించడం, ప్రాథమిక పాఠశాలలో భాషా పండితులను నియమించడం లాంటి పనులు చేయాల్సి ఉందని చెప్పారు. జీవో 2, 3లను కాపాడుకుంటూ మిగిలిన భాషాపండితులకు పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెద్దేముల్ మండలశాఖ అధ్యక్షుడిగా సీహెచ్.మోహన్, ప్రధానకార్యదర్శిగా పి.సుజాత, కోశాధికారిగా ఏ.జయశ్రీ, మహిళా అధ్యక్షురాలిగా పద్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు వడిచర్ల సత్యం, జిల్లా కార్యదర్శి కవిత, కన్వీనర్ మోహనయ్య, సీనియర్ ఉపాధ్యాయులు నెహ్రూచౌహాన్ పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చారిత్రక ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

మహేశ్వరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఆష్త ప్రభుత్వం చారిత్రక ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ జెన్నాయిగూడ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా రావిరాలకు చెందిన కోటగళ్ల రంజిత్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ నూతన చైర్మన్‌ను, అలాగే డైరెక్టర్లుగా నారాయణరెడ్డి, సుప్రియ, రవీందర్, దర్శన్‌లను నియమించామన్నారు. వీరంతా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



రంజిత్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న కేఎల్లార్

బీజేపీ మెదక్ ఇన్‌చార్జిగా బొక్క నర్సింహారెడ్డి



కందుకూరు,నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కొత్తగూడకు చెందిన బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిని పార్టీ మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్‌రావు ఆదివారం నర్సింహారెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. కందుకూరు మండల, జిల్లా ప్రజలకు రాజకీయంగా సేవలందించిన ఆయనను గుర్తించి మెదక్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారని పార్టీ నాయకులు అంటున్నారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నాయకత్వం తనపై నమ్మకంతో మెదక్ జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం సంతోషకరం అన్నారు. పార్టీ అభివృద్ధికి మరింత దృఢ చిత్తంతో పనిచేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృత్యువాత



యాచారం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై గునగల్ రిజర్వ్ ఫారెస్టులో వాహనం ఢీకొని జింక మృతిచెందింది. ఆదివారం జింక రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. అటుగా వస్తున్న వాహనాదారులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. ఫారెస్ట్ అధికారి నర్సింహ జింక కళేబరాన్ని ఖననం చేశారు. కాగా అటవీ ప్రాంతంలో వాహనాదారులు 25 నుంచి 40కిలో మీటర్ల వేగం కంటే ఎక్కువ వెళ్లొద్దని, వన్యప్రాణులు సంచరిస్తాయని కోరారు.



లెక్క చెప్పకుంటే అంతే..

అభ్యర్థులు పూర్తి వివరాలు ఇవ్వకపోతే తిరస్కరణే

తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నియమావళిని విడుదల చేసింది. పాత నిబంధనలను మార్పు చేస్తూ, కొత్త వాటిని జత చేస్తూ ప్రణాళిక ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పూర్తి వివరాలు తెలియజేయకపోతే ఆదేశాలను ఉల్లంఘించినట్లుగా పరిగణించి నామినేషన్ల పరిశీలన సమయంలో రిటర్నింగ్ అధికారి బేషరతుగా నామినేషన్ తిరస్కరించేలా ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీరాజ్ చట్టం సబ్‌రూల్ - 3 ప్రకారం సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌తోపాటు ఆస్తులు, అప్పులకు సంబంధించి స్వీయ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని ఎన్నికల సంఘం పేర్కొంది.

అందరికీ తెలిసేలా నోటీస్ బోర్డుపై వివరాలు

అభ్యర్థుల నుంచి నామినేషన్ స్వీకరించిన తర్వాత రిటర్నింగ్ అధికారి వాటిని గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డుపై పెడతారు. అభ్యర్థులు తప్పుడు సమాచారం అందించినా, ఏదైనా అభ్యంతరాలుంటే ఓటర్ల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. వాటిని పరిశీలించాక, నియమావళి ప్రకారం లేకపోతే తిరస్కరించే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు నేర చరిత్రను వెల్లడించినట్లే ఇకపై పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారు సైతం పూర్తి వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. ఆస్తులు, అప్పుల వివరాలను నామినేషన్ పత్రాల్లో పొందుపర్చడంతోపాటు విద్యార్హత పత్రాలను అందజేయాలి. అందుకు సంబంధించి అభ్యర్థులు ఇద్దరు సాక్షుల సంతకం తప్పక తీసుకోవాలి. వీటిలో ఏ ఒక్కటి లేకున్నా అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.





ఎన్నికల్లో సామాన్యుడు పోటీచేయలేని పరిస్థితి



పరిగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నా వయస్సు 78 ఏళ్లు. 60ఏళ్ల క్రితం పరిగి పంచాయితీకి జరిగిన ఎన్నికల్లో మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకున్నా. అప్పట్లో మంచితనానికి ఓట్లు వేసేవారు. ఒకమాట పెద్దలు ఎవరైనా చేబితే వినే వారు. ఫలనా వ్యక్తి మంచోడని గుర్తించి చెబితే ఆమాట విని గెలిపించేవారు. ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి. రాజకీయ చైతన్యం పెరిగినా విలువలు పడిపోయాయి. మంచినాయకుణ్ణి ఎన్నుకునే పరిస్థితులు లేవు. ఒక్క వ్యవస్థను దిశానిర్దేశం చేసే ముందు ఓ మంచి నాయకుడు ఉండాలని ఆలోచించేవారు లేకుండా పోతున్నారు. ఎన్నికల ఖర్చు నాటితో పోల్చుకుంటే వందరెట్లు పెరిగింది. ఎన్నికలను కాస్ట్లీ చేశారు. మాములు వ్యక్తులు ఎన్నికల్లో తలపడే పరిస్థితి లేదు. ఓటర్లు కూడా మద్యం, డబ్బుల ప్రభావానికి దిగజారే రోజులు వచ్చాయి. సర్పంచ్ అనే వ్యక్తి పార్టీలకతీతంగా గ్రామస్తులందరినీ సమానంగా చూసే వ్యక్తి అయి ఉండాలి. ప్రలోభాలకు లోనై ఓటువేస్తే వారే ఐదేళ్లు అనుభవించాల్సి ఉంటుంది. మంచితనం, సేవాదృక్పథం ఉన్న వ్యక్తిని సర్పంచ్‌గా ఎన్నుకోవాలి.

- సీనియర్ సిటిజన్, రిటైర్డ్ తహసీల్దార్ చిన్నయ్య

ప్రజలను మోసగించిన కాంగ్రెస్

కడ్తాల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసగించిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పే సమయమొచ్చిందని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారం, ఓట్ల కోసమొచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. గడ్డమీద తండాలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి చిట్టి రమేశ్‌కు మద్దతుగా ఆదివారం ర్యాలీ నిర్వహించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, సర్పంచ్‌లుగా ఆ పార్టీ బలపర్చిన వారినే గెలిపించాలని ప్రజలను కోరారు.



గడ్డమీది తండాలో ర్యాలీలో దశరథ్ నాయక్

అర్ధ శతాబ్దం ఒకే కుటుంబం

కరన్‌కోట్‌లో సర్పంచ్‌గా బాధ్యతలు

తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో కరన్‌కోట్, జినగుర్తి, సంగెం కలాన్‌లో ఒకే కుటుంబానికి ఎక్కువ కాలం సర్పంచ్‌లుగా కొనసాగే అవకాశాన్ని గ్రామస్తులు కల్పించారు. ఒకే కుటుంబంలో గ్రామ ప్రథమ పౌరులుగా సేవ చేసే అవకాశం లభించడం విశేషం. మండలంలో అతిపెద్ద గ్రామమైన కరన్‌కోట్ గ్రామంలో గాజుల రాచప్పకు గ్రామస్తులు ఏడు సార్లు సర్పంచ్‌గా కొనసాగే అవకాశం కల్పించారు. తర్వాత ఆయన కుమారుడు గాజుల శాంత్‌కుమార్ సర్పంచ్ కాగా, తర్వాత మరో కుమారుడు గాజుల శంభు లింగంకు సర్పంచ్ అవకాశం ఇచ్చారు. తర్వాత గాజుల శాంత్‌కుమార్ భార్య గాజుల చంద్రకళకు సర్పంచ్‌గా సేవ చేసే అవకాశం ఇచ్చారు.



కరన్‌కోట్ సర్పంచ్‌గా 7 సార్లు పని చేసిన గాజుల రాచప్ప (ఫైల్)



జిన్‌గుర్తిలో మొదటి సర్పంచ్‌గా పని చేసిన పడగల రామప్ప (ఫైల్)



సంగెం కలాన్ గ్రామంలో సర్పంచ్‌లుగా పని చేసిన తండ్రి, తల్లి, తనయుడు (ఫైల్)

జిన్‌గుర్తిలో 35 ఏళ్లుగా..

జిన్‌గుర్తి గ్రామంలో పడగల కుటుంబానికి 35 ఏళ్లుగా సర్పంచ్‌గా సేవ చేసే అవకాశాన్ని ప్రజలు కల్పించారు. గ్రామ పంచాయతీ ఏర్పాడిన మొదటిసారి పడగల రామప్పకు సర్పంచ్‌గా అవకాశం లభించింది. రెండోసారి కూడా ఆయనే సర్పంచ్‌గా కొనసాగారు. తర్వాత తన మొదటి తనయుడు పడగల కరన్‌చంద్ 1981లో సర్పంచ్‌గా పని చేశారు. తర్వాత రెండో తనయుడు ఉత్తం చంద్ 1988లో మొదటి సారి, 1995లో రెండోసారి సర్పంచ్‌గా ప్రజలు అవకాశం ఇచ్చారు. 2006లో కరన్ చంద్ తనయుడు మురళికి సర్పంచ్‌గా అవకాశం కలిగింది.

సంగెం కలాన్‌లో తండ్రి, తల్లి, తనయుడు

సంగెం కలాన్ గ్రామంలో ఒకే కుటుంబం నుంచి ముగ్గురు సర్పంచ్‌లుగా కొనసాగారు. మొదటగా నారాయణగౌడ్ సర్పంచ్‌గా కొనసాగగా, తర్వాత ఆయన భార్య బకులావతి సర్పంచ్‌గా పని చేశారు. వీరి తర్వాత వీరి తనయుడు మేఘనాథ్ గౌడ్ సర్పంచ్‌గా పని చేసే అవకాశం కల్పించారు. ఆ గ్రామానికి తల్లి, తండ్రి, తనయులు ముగ్గురు కూడా సర్పంచ్‌లుగా చేయడం విశేషం.

ఏకగ్రీవాల కోసం కసరత్తు

» రంగంలోకి నాయకులు

కులకచర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లను ఏకగ్రీవం చేసుకునేందుకు తీవ్ర కసరత్తు జరుగుతోంది. పలు గ్రామాల్లో బడి, గుడికి నిధులు ఇస్తే ఏకగ్రీవం చేస్తామని గ్రామస్థులు తీర్మానాలు చేస్తున్నారు. నామినేషన్లు వేసేందుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో గ్రామాల్లో రాజీకి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సొంత గ్రామమైన తిరుమలాపూర్‌లో సర్పంచ్‌ను ఏకగ్రీవం చేసేందుకు ఆయన సోదరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీనివాస్‌రెడ్డి రంగంలోకి దిగారు. మండల పరిధిలో ఆయనకు పట్టు ఉంది. తిరుమలాపూర్ ఏకగ్రీవమైతే చుట్టుపక్కల గ్రామాలు సైతం ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా తండాల్లో సైతం ప్రజలు ఏకగ్రీవం వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఏడు పంచాయతీలు ఏకగ్రీవం కాగా ఈసారి అధికంగా ఏకగ్రీవమయ్యే అవకాశం కనిపిస్తోంది.

పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న జరుగనున్న పంచాయతీ ఎన్నికలకు ఆమనగల్లు మండలంలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఎన్నికల బందోబస్తు వివరాలను ఎస్ఐ వివరించారు. మండలంలో 13పంచాయతీల్లో ఎన్నికలకు భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మంగళపల్లి, మేడిగడ్డ, కోనాపూర్, పోలెపల్లి, శెట్టిపల్లి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని చెప్పారు. అదనపు బలగాలను మోహరిస్తామని చెప్పారు. గతంలో గొడవల్లో భాగస్వాములను, రౌడిషీటర్లను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామన్నారు. పోటీలో నిలిచే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్ఐ వెంకటేశ్ కోరారు.

సొంత డబ్బుతో యూజీడీ పనులు



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలనీవాసులు

మొయినాబాద్ రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని అధికారుల చుట్టూ తిరిగి వేసారిగిన కాలనీవాసులు సొంతంగా డబ్బులు పోగేసుకొని మురుగు కాలువల నిర్మాణానికి పూనుకొని ఆదివారం భూమిపూజ చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధి భరద్వాజ కాలనీలో మురుగు కాలువలు సక్రమంగా లేక ఇళ్ల మధ్యనే మురుగు పారుతోంది. అధికారులు సమస్య తీర్చకపోవడంతో కాలనీవాసులే చందాలు వేసుకొని పనులకు శ్రీకారం చుట్టారు. రూ.10లక్షల వరకు ఖర్చయ్యే పనులకు కాలనీలో వాసి కేవీఎంఆర్ శర్మ రూ.5లక్షల విలువైన మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యక్షుడు సలీం, ప్రధాన కార్యదర్శి బి.కుమార్, అదనపు కార్యదర్శి గప్పార్, అకౌంటెంట్ నర్సింహులు, జహంగీర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మేడ్చల్ మండల కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన విశ్వబ్రాహ్మణ సంఘం

మేడ్చల్ టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణ సంఘం మేడ్చల్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.పద్మాచారి, ఉపాధ్యక్షుడిగా వి.వెంకటేశంచారి, కోశాధికారులుగా సత్యనారాయణచారి, వీరాచారి, సెక్రటరీగా సీహెచ్ భాస్కరాచారి, కార్యవర్గ సభ్యులుగా సానాల రవి చారి, పొత్కనూరి శేఖరచారి, వడ్ల సంతోష్ చారి, తాటికొండ శ్రీనివాసచారి, అనంతోజి ప్రవీణ్ కుమార్ చారిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందనలు తెలిపారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న తల్లోజు ఆచారి

బీజేపీని అభ్యర్థులను గెలిపించాలి

కడ్తాల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించి గెలిపించాలని పార్టీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తోందని చెప్పారు. కోర్లకుంట తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉన్నారు.



రాజీవ్ గృహకల్ప సమీపంలో నూతనంగా నిర్మించిన దత్తాత్రేయ స్వామి ఆలయం

వేడుకగా గురుదత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్ గృహకల్ప సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ గురుదత్తాత్రేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు చేపట్టారు. 28 నుంచి ప్రారంభమైన ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు 5వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ ధర్మకర్త, మాజీ కౌన్సిలర్ మురళి తెలిపారు. 4వ తేదీన విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకోవాలన్నారు. నాలుగు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శాఖాహారం, ధ్యానం ఆరోగ్యకరం

పరిగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శాఖాహారం, ధ్యానం ఆరోగ్యకరమని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పిరమిడ్ వ్యవస్థాపకులు పత్రీజీ మానవాళి ఆరోగ్యానికి, ఆనందానికి శాఖాహారం, ధ్యానం గురించి చేసిన సేవలు ఎనలేనివన్నారు. బ్రహ్మర్షీ పత్రీజి ప్రచారం అభినందనీయమన్నారు. నిత్యం ధ్యానం చేయడం వల్ల మనిషి మానసిక ప్రశాంతతతో జీవించగలుగుతారని చెప్పారు. పత్రీజీ నిర్వహించే కార్యక్రమాలకు తనవంతుగా సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధ్యానప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శంకర్, కడ్తాల్ ట్రస్టీ లక్ష్మీ, కృష్ణ, ప్రవీణ్, సునీత, తిరుపతయ్య, వెంకటరంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పటేల్ విజయ్ కుమార్

తాండూరు రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో చిట్టిఘనాపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన పటేల్ విజయ్ కుమార్ సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు ఆదివారం ఏకగ్రీవం కావడం పట్ల వారంతా తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆయన గ్రామ పంచాయతీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారం అందిస్తామన్నారు.



తాండూరు న్యూ నలంద హైస్కూల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యూ నలంద హైస్కూల్‌లో 2004-05 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులు చంద్ర మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డితో పాటు మిగతా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. 20ఏళ్ల తర్వాత కలిసిన వీరంతా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకోవడంతో పాటు ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ఆదుకోవాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎలిమినేడులో ఇటీవల జరిగిన ఈపీఎల్ సీజన్-8 క్రికెట్ పోటీలో విజేత టీంకు ఆదివారం రాత్రి ట్రోఫీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో క్రికెట్‌లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులున్నారని, వారిని ప్రోత్సహిస్తే జాతీయ స్థాయిలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షులు నిట్టు జగదీష్, మాజీ ఉపసర్పంచ్ రాంరెడ్డి, నాయకులు బి.మహేష్, వెంకటేష్, శేఖర్ గౌడ్ తదితరులున్నారు.

అశ్రునయనాల మధ్య బ్రహ్మయ్య అంత్యక్రియలు

యాచారం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల సీనియర్ నాయకుడు పెండ్యాల బ్రహ్మయ్య అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. గాండ్లగూడ నుంచి యాచారం అంబేడ్కర్ విగ్రహం వరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి పి.యాదయ్య బ్రహ్మయ్య పాడె మోశారు. ప్రజానాట్య మండలి కళాకారులు బ్రహ్మయ్య చేసిన గుర్తు చేస్తే పాటల రూపంలో ఆలపించారు. వందలాది మంది జనం, పార్టీ శ్రేణులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంత్యక్రియల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.భాస్కర్, చుక్క రాములు, రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ, నాయకులు కె.భాస్కర్, భూపాల్, పి.జంగారెడ్డి, కె.రమేష్‌గౌడ్., బి.మధుసూదన్‌రెడ్డి, నర్సింహ, పి.అంజయ్య, మస్కు అరుణ, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మయ్య పాడె మోస్తున్న జాన్‌వెస్లీ, యాదయ్య

జోరుగా నామినేషన్ల పర్వం


ధారూరు: నామినేషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర


నవాబుపేట: నామినేషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్

కొడంగల్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్పంచ్, వార్డుసభ్యుల నామినేషన్ల కార్యక్రమం ఈనెల 27వ తేదీన ప్రారంభమై 29వ తేదీతో ముగిసింది. కొడంగల్ మండలంలో 25 గ్రామా పంచాతీల నుండి సర్పంచ్‌లకు 152 నామీనేషన్‌లు దాఖలు కాగా వార్డు సభ్యులకు 445 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎంపీడీవో ఉషశ్రీ ఆదివారం తెలిపారు.

బషీరాబాద్: మండలంలో 39పంచాతీయలకు గానూ మొత్తంగా 208 సర్పంచులు, 616వార్డులకు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో సంపత్‌కుమార్ తెలిపారు. కాగా ఆదివారం అధికారులు నామినేషన్ల ఘట్టం ముగించారు.


బషీరాబాద్: దామర్‌చెడ్‌లో పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ నుమాన్‌అలీ

నాలుగు వార్డుల్లో జీరో నామినేషన్లు

కొడంగల్ మండలంలో భవనమ్మ తండా పంచాయతీలో నాలుగు వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. భవనమ్మతండా పంచాయతీలో 8వార్డులు ఉండగా కేవలం నాలుగు వార్డులకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 5, 6, 7, 8 వార్డులకు నామినేషన్లు వేయలేదు.

నామినేషన్ కేంద్రాల సందర్శన

ధారూరు: ధారూరు, కేరెల్లి గ్రామాల్లోని పంచాయతీ నామినేషన్ కేంద్రాలను ఆదివారం వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర సందర్శించారు. నామినేషన్ కేంద్రాల్లో అధికారులు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సాజిదా బేగం, అధికారులు ఉన్నారు.

బషీరాబాద్: దామర్‌చెడ్‌లో పోలింగ్ కేంద్రాన్ని బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీ ఆదివారం పరిశీలించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం స్థానిక యువకులతో సమావేశమై పలు అంశాలపై ఆయన చర్చించారు. ఎస్ఐ వెంట హెడ్‌కానిస్టేబుల్ లోక్యానాయక్ ఉన్నారు.

వికారాబాద్: పంచాయతీ ఎన్నికలకు రెండో విడత నామినేషన్లకు వికారాబాద్ డివిజన్ సిద్ధమైంది. ఆదివారం తొలిరోజు నామినేషన్ల పెద్ద మొత్తంలో వచ్చాయి. డివిజన్‌లోని వికారాబాద్, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట, కోట్‌పల్లి బంట్వారం, నవాబుపేట మొత్తం కలిపి 175 పంచాయతీ ఉండగా తొలిరోజు 184 నామినేషన్లను అధికారులు అందుకున్నారు. మొత్తం 1520వార్డులు ఉండగా 182 మంది నామినేషన్లు వేశారు. వికారాబాద్ మండలంలో 21గ్రామ పంచాయతీలకు గానూ 30 నామినేషన్లు రాగా, ధారూరు 34 పంచాయతీలు 35, మోమిన్‌పేట 29గ్రామపంచాయతీలకు 30, నవాబుపేట 32 గ్రామ పంచాయతీలకు 35, బంట్వారం 12 గ్రామ పంచాయతీలకు 8, మర్పల్లి 29 గ్రామ పంచాయతీలకు 25, కోట్‌పల్లి 18 గ్రామ పంచాయతీలకు గాను 21 నామినేషన్ల అందినట్లు అధికారులు పేర్కొన్నారు.

మర్పల్లి: మండలంలోని 11 క్లస్టర్లలో మొదటిరోజు ఆదివారం పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభమయ్యాయి. సర్పంచ్‌కు 26, వార్డు సభ్యులకు 21 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జయరాం తెలిపారు.

మోమిన్‌పేట్: మండలంలో మొదటి రోజు సర్పంచ్‌కు 29మంది, వార్డుసభ్యులకు 43మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. టేకులపల్లి సర్పంచ్ అభ్యర్థిగా బండవిష్ణువర్ధన్‌రెడ్డి, ఎన్కతల సర్పంచ్ అభ్యర్థిగా శ్రీకాంత్‌గౌడ్, శివరాములు, మోమిన్‌పేట్‌లో సుభాష్‌గౌడ్‌తో పాటు వార్డు స్థానాల్లో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్ నవాబుపేట మండలంలో నామినేషన్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. మండలంలోని ఏక్‌మామిడి, నవాబుపేట, పులుమామిడి, చించల్‌పేట్ నామినేషన్ కేంద్రాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనురాధ, సూపరింటెండెంట్ అజయ్‌కుమార్, ఎంపీవో విజయ్‌కుమార్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.


నవాబుపేట: నామినేషన్ దాఖలు చేస్తున్న అక్నాపూర్ సర్పంచ్ అభ్యర్థిని హైమావతి

నవాబుపేట: మండలంలో నామినేషన్ కేంద్రాలను మోమిన్‌పేట్ సీఐ వెంకట్ పరిశీలించారు. ఎన్నికల విధుల్లో అధికారులు అలసత్వం వహించొద్దని సూచించారు. మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా 276 వార్డులు ఉన్నాయి. రెండో విడత నామినేషన్‌ల పర్వం ఆదివారం ప్రారంభమైంది. మొదటి రోజు సర్పంచ్‌కు 38 మంది, వార్డు స్థానాలకు 49 నామినేషన్లు స్వీకరించినట్లు ఎంపీడీవో అనురాధ తెలిపారు.

ధారూరు: మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు నామిషనేషన్ల స్వీకరణ ఆదివారం ప్రారంభమైంది. సర్పంచ్ స్థానాలకు 35నామినేషన్లు, 286వార్డు మెంబరు స్థానాలకు 17నామినేషన్లు అందాయని ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. పది నామినేషన్ కేంద్రాల్లో అధికారులు నామినేషన్లను స్వీకరించారు. నాగసమందర్ 4, గురుదోట్ల 1, పీసీఎం తండా1, నాగారం 1, దోర్నాల 1, మోమిన్‌కలాన్ 1, అంతారం 5, మోమిన్‌కుర్దు 1, రాజాపూర్ 2, తరిగోపుల 1, ధారూరు 3, ధారూరు స్టేషన్2, రాంపూర్ తండా 1, కేరెల్లి 3, ఎబ్బనూర్ 1, మున్నూర్ సోమారం 4, కుక్కింద 1, నర్సాపూర్ 1, రుద్రారం 1 నామినేషన్లు సర్పంచ్ స్థానాలకు దాఖలు అయ్యాయని ఆయన చెప్పారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

యాలాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన శనివారం జరిగింది. యాలాల మండల పరిధిలోని రాస్నం గ్రామానికి చెందిన సారా లక్ష్మణ్ రెండో కుమారుడు నరేష్(21) ఆమనగల్లులోని ఓ చికెన్‌సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కోళ్ల ఫారంకు వెళ్లి కోళ్లను తెచ్చేదారిలో ఓ జామచెట్టు ఎక్కి జామకాయలు తెంపుతుండగా, జామచెట్టు పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. నరేష్ మృతితో రాస్నం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. యువకుడి మృతదేహాన్ని ఆదివారం గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

అతివేగం.. బ్రిడ్జిపై నుంచి పడిన కారు

● తప్పిన ప్రాణాపాయం ● సురక్షితంగా బయటపడిన యువకులు

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి బ్రిడ్జి నుంచి కింద పడింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు ఆదివారం కావడంతో వికారాబాద్ వస్తుండగా ఉదయం మంచుకురిసే సమయంలో కారు గంగారం సమీపంలో అదుపుతప్పి బ్రిడ్జి కిందకు పడిపోయింది. స్థానికులు వెంటనే కొత్తగా బ్రిడ్జి పనులు చేస్తున్న కార్మికులు కారులో ఉన్న యువకులను బయటకు తీయగా ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం స్థానికుల సాయంతోట కారును అక్కడి నుంచి తీసివేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు


నాగమణిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారాయణపూర్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గుర్రాల నాగమణి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాగమణికి కాంగ్రెస్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే సర్పంచ్‌గా ఎన్నికైన నాగమణికి సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సిరెడ్డి, మైపాల్ పాల్గొన్నారు.

ధారూరు: దోర్నాల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిలు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆరని మంటలు

(ఐదో పేజీ తరువాయి)


ఫైరింజన్‌తో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది(ఫైల్)

మంటలు అదుపులోకి రావడంలేదు. దీంతో మున్సిపాలిటీ ట్యాంకర్లతో నీటిని తీసుకువచ్చి ఫైరింజన్‌లోకి ఎక్కించ మంటలను అదుపు చేసేందుకు ఎంత శ్రమించినా మంటలు పూర్తిగా అదులోకి రాలేదు. ఒకవైపు ఆర్పుతుంటే మరోవైపు దట్టమైన పొగ కమ్ముకుంటోంది. పరిసరాల్లోకి వెళ్తే కళ్లు తిరిగి వాంతులు చేసుకునే పరిస్థితి నెలకొన్నది. ప్రధానంగా ప్లాస్టిక్ వ్యర్థాలు కాలడం వల్ల వచ్చే దుర్వాసనతో ఎటు రెండు కిలోమీటర్ల దాకా జనాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇది ఔటర్ టోల్ ప్లాజాకు ఆనుకుని ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

5,763 తొలి విడత నామినేషన్లు..

(ఐదో పేజీ తరువాయి)

పదవులకు 1,384 నామినేషన్లు రాగా, 2,198 వార్డు పదవులకు 4,379 నామినేషన్లు వచ్చాయి. డిసెంబరు ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లకు సంబంధించిన అభ్యంతరాలను స్వీకరిస్తారు. 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వాటిని పరిష్కరిస్తారు. 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాతోపాటు వారికి కేటాయించిన గుర్తులను ప్రకటించనున్నారు.

రెండో విడత తొలిరోజు

(ఐదో పేజీ తరువాయి)

నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. రెండో విడత ఎన్నికలు నిర్వహిస్తున్న 175 పంచాయతీల్లో నామినేషన్ల స్వీకరణ తొలిరోజు సర్పంచ్ పదవులకు 184 నామినేషన్లు రాగా, 1,520 వార్డులకు 182 నామినేషన్లు వచ్చాయి. వికారాబాద్ మండలంలో 21 పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం 30 నామినేషన్లు రాగా, 182 వార్డుల్లో 23 నామినేషన్లు వచ్చాయి. ధారూరు మండలంలో 34 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 35 నామినేషన్లు రాగా, 286 వార్డు పదవులకు 17 నామినేషన్లు దాఖలయ్యాయి. మోమిన్‌పేట్ మండలంలో 29 పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం 30 నామినేషన్లు, 256 వార్డు పదవులకు 52 నామినేషన్లు వచ్చాయి. నవాబ్‌పేట్ మండలంలో 32 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 35 నామినేషన్లు, 276 వార్డు పదవులకు 49 నామినేషన్లు దాఖలయ్యాయి. బంట్వారం మండలంలో 12 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఎనిమిది, 106 వార్డు పదవులకు 12 నామినేషన్లు వచ్చాయి. మర్పల్లి మండలంలో 29 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 25 నామినేషన్లు, 264 వార్డు పదవులకు 21 నామినేషన్లు దాఖలయ్యాయి. కోట్‌పల్లి మండలంలో 18 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు 21 నామినేషన్లు, 150 వార్డు పదవులకు ఎనిమిది నామినేషన్లు వచ్చాయి.

ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలి



ప్రతిభ కనబర్చిన వారిని అభినందించిన రెడ్డి సంఘం నాయకులు

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడం మన అందరి బాధ్యత అని ఎత్తిపోతల పథకం సలహాదారు కొత్తపల్లి పెంటారెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణం కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రూపు 1, ఐఐటీ, నీట్ ర్యాంకర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ హౌసింగ్ బోర్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, న్యాయవాది యాదవరెడ్డి, మాదవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రత్నారెడ్డి, నరోత్తంరెడ్డి, బుచ్చిరెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాసు పుస్తకాలు అందేదెన్నడు?

● రైతన్నల ఎదురు చూపులు
● రుణాలు, పథకాలు అందక ఇబ్బందులు

కొడంగల్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నా సంబంధిత రైతులకు సకాలంలో పట్టాదారు పాసుపుస్తకాలు అందడం లేదు. దీంతో రైతులు బ్యాంకుల నుంచి రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో గత ఆరు నెలలుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు పాసుపుస్తకాలు సరాఫరా కావల్సి ఉంది.గతంలో ఉన్న ధరణి, నూతనంగా వచ్చిన భూభారతి పోర్టల్‌లో మండల రెవెన్యూ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇలా కొత్త రైతులకు సంబంధించి వెయ్యికి పైగానే రిజిస్ట్రేషన్లు జరగడంతో వీరికి పాసుపుస్తకాలు రావల్సిఉంది. రైతుభరోసా, పీఎం కిసాన్, పంట రుణాలు, విత్తన రాయితీలు, ఎరువులు తదితర వాటిని పొందేందుకు పట్టాదారు పాసు పుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. దీంతో రైతులు వాటికి దూరమవుతున్నారు. రిజిస్ట్రేషన్లు పూర్తయి నెలలు గడుస్తున్నా రైతుల చేతికి పాసు బుక్కులు అందడం లేదు. తపాలా ద్వారా పట్టాదారు పాసుపుస్తకాలు పంపిస్తుండగా, రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యాక నెలలోపు కొత్త వాటిని రైతులకు చేరేవి. ఐదు నెలలుగా పాసుపుస్తకాలు రావడం లేదంటూ కొంతమంది రైతులు మీసేవా కేంద్రాల వద్దకు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



పట్టాదారు పాసు పుస్తకం

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక కొద్ది రోజుల్లోనే గతంలో రైతు చిరునామాకు పట్టాదారు పాసుపుస్తకాలు తపాలాద్వారా అయ్యేవి. అయితే కొన్ని నెలలుగా పాసుపుస్తకాలు రావడంలేదనేది వాస్తవమే. ఆలస్యమైనా అందుతాయి. ఎవరూ ఆందోళన చెందొద్దు.

- పి.రాంబాబు, తహసీల్దార్, కొడంగల్

మూడు నెలలుగా ఎదురు చుస్తున్నా



మూడు నెలల్రకితం భుమి రిజిస్ట్రేషన్ చేసుకున్నా. ఇప్పటి వరకు పాసు పుస్తకం రాలేదు. తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే పైనుంచి రావాల్సిందే అంటున్నారు. పోస్టులో వస్తాయని చెప్పారు. పోస్టాఫీసులో అడిగితే వస్తే ఇస్తాం కదా? అని అంటున్నారు.

- డి.మాణిక్యప్ప, టేకుల్‌కోడ్, కొడంగల్ మండలం

రోడ్డు బాగుపడేది ఎప్పుడో?

● వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
● పాదచారులకు తప్పని ఇక్కట్లు
● పట్టించుకోని పాలకులు


బషీరాబాద్: గ్రామ పంచాయతీ వద్ద ప్రధానరోడ్డు దుస్థితి

బషీరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఎదుట ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు ఇప్పట్లో బాగుపడేలా లేదని స్థానికులు అగ్రహం వెళ్లగక్కుతున్నారు. ఈ రోడ్డు పనులను నెలల తరబడి అసంపూర్తిగా వదిలేయడంతో బురదగా మారి వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కాలినడకన వెళ్లడానికి పాదచారులు పడారని పాట్లు పడుతున్నారు. కాంట్రాక్టర్ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియడంలేదని పలువురు మండిపడుతున్నారు. బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు గల మార్గాన్ని అభివృద్ధి పర్చేందుకు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. రెండు నెలల కిందట రోడ్డుపనులు మొదలుపెట్టారు. ఈపనుల్లో భాగంగా బషీరాబాద్ గ్రామపంచాయతీ వద్ద ప్రధాన మార్గాన్ని సీసీనిర్మాణం చేపట్టేందుకు ఎక్స్‌కావేటర్‌తో తవ్వారు. ఇటీవల కొంత మొరం వేసి ఎక్కడికక్కడ వదిలేశారు. ఫలితంగా స్థానిక ప్రజలు కాలినడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిసారించి వెంటనే ఇక్కడి రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


రోడ్డంతా బురద కావడంతో దాటేందుకు వృద్ధుల పాట్లు

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ


ఘట్‌కేసర్: మహాపడి పూజలో వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్. నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిదిలోని శివారెడ్డిగూడలో గల శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో అయ్యప్ప మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్ గీతామందిర్‌లో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీకుంటున్నదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్‌గౌడ్, ముత్యాలు యాదవ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య, అబ్బసాని యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రబాకర్‌రెడ్డి, అంజి రెడ్డి, రాంరెడ్డి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.


కులకచర్ల అయ్యప్పస్వామి ఆలయంలో పూజల్లో స్వాములు

కులకచర్ల: అయ్యప్ప కొండ అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. ఆదివారం స్థానిక అయ్యప్ప కొండపై స్వాములు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య పూజల్లో భాగంగా పడిపూజ నిర్వహించారు. అనంతరం స్వాములకు గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలె కృష్ణయ్యగౌడ్ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి


మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

చౌడాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు సత్తా చాటాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాంచందర్, జంగయ్య పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కే.మహేశ్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ కండువాలతో మహేశ్‌రెడ్డి ఆహ్వానించారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. ప్రజలు కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు.ప్రస్తుతం జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుల గెలుపునకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణయ్య, శివుడు, రమేశ్, దాసు, అశోక్, చందు, వెంకటయ్య, రాజు, మహమూద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు


బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపల్లికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరగా ఆదివారం కండువాలతో ఆయన ఆహ్వానించారు. పార్టీ పటిష్ఠతకు కలిసికట్టుగా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, వైస్‌ఎంపీపీ మల్లేశ్, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజీరెడ్డి, నాయకులు సంతోష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ

దోమ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని బ్రహ్మణపల్లి, బుద్లాపూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మణపల్లిలో క్రీడాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

ప్రధాని మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నేతలు


ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నేతలు

తాండూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం బూత్ నంబర్ 124లో సీనియర్ బిజేపీ నాయకులు మోత్కుపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేశ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, మన్‌కీ బాత్ జిల్లా కన్వీనర్ బంటారం భద్రేశ్వర్, మాజీ కౌన్సిలర్ సాహు శ్రీలత, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం, కార్యదర్శి రాజు తిలకించారు.

సమాజంలో మహిళల పాత్ర ప్రధానమైనది


మంజుల రమేష్‌ను సన్మానిస్తున్న పూర్వ శిశు మందిరం బృందం

వికారాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సక్రమ మార్గంలో నడపడంలోట మహిళల పాత్ర ప్రధానమైనదని వికారాబాద్ మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్ అన్నారు. శిశు మందిరం పూర్వ విద్యార్థిని శారదాదయానిధి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన సప్తశక్తిసంగం.. మహిళా మాతృమూర్తుల సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక కుటుంబంలో సిరి సంపదలు ఉండాలంటే మహిళ చేతిలోనే ఉంటుందన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ భారతదేశ కీర్తిని ప్రపంచ స్థాయిలో నిలబెడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీదేవి సదానందారెడ్డి, వక్తలుగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీలతారెడ్డి, వాణి సక్కుబాయి, ప్రసన్న, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.